సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 29 । మే । 2025



చీనీ టన్ను రూ.33,770

అనంతపురం మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33,770 పలికాయి.



పారిశ్రామికవాడలో విద్యుత్ సమస్య

కుమ్మరవాండ్లపల్లి పారిశ్రామిక వాడలో విద్యుత్ సమస్య ఏర్పడింది. ఐదు నిమిషాలకోసారి కరెంట్ పోతోంది. 8లో

గరిష్టం/కనిష్టం
32.1°/21.4°

జిల్లా పరిధిలో బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పెరిగిన శ్రీవారి ఆలయ ఆదాయం



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు హుండీలో వేసిన కానుకలను బుధవారం ఆలయ, బ్యాంకు అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో లెక్కించారు. 62 రోజులకు గాను రూ.1,10,69,573 నగదుతో పాటు 72 గ్రాముల బంగారు, 662 గ్రాముల వెండి ఆదాయం వచ్చినట్లు ఈఓ వి.శ్రీనివాస రెడ్డి తెలిపారు. గతంలో కంటే ఈసారి ఆలయ ఆదాయం పెరిగినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి ఎన్.ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ చలపతి, ఆలయాధికారులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఫార్మసీ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న జేఎన్‌టీయూ అధికారులు

అనంతపురం: బీఫార్మసీ ఫలితాలు విడుదలయ్యాయి. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఏప్రిల్, మే నెలలో నిర్వహించిన బీఫార్మసీ నాలుగో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్-19), (ఆర్-15) సప్లిమెంటరీ, ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్ (ఆర్-21) సప్లిమెంటరీ ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి. నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ(ఏ) వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ ప్రొఫెసర్ జి. శంకర్ శేఖర్ రాజు, డాక్టర్ ఎం. అంకారావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్ట్

ధర్మవరం రూరల్: బాలుడి కిడ్నాప్ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను టూటౌన్ పోలీసులు బుధవారం మీడియాకు వెల్లడించారు. ధర్మవరంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన నరసింహులు, సుమలత దంపతుల కుమారుడు శ్రీనాగచైతన్య అనే చిన్నారి మార్చి 24న ఇంటి వద్ద ఆడుకుంటూ కనిపించకుండాపోయాడు. తల్లి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బాలుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. అయితే ఈ నెల పదో తేదీన నాగచైతన్య ఇంటికి తిరిగి వచ్చాడు. మిస్సింగ్ మిస్టరీని ఛేదించేందుకు పోలీసులు లోతుగా విచారణ చేపడితే విస్తుపోయే విషయం వెలుగుచూసింది. బాలుడిని కిడ్నాప్ చేసింది మేన మామ ప్రశాంత్, అతని మామ వెంకటరాముడు అని తేలింది. ఈ రెండు కుటుంబాల మధ్య పాతకక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో ఎలాగైనా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో సుమలత చిన్నకుమారుడైన నాగచైతన్యను ప్రశాంత్, వెంకటరాముడు దాచిపెట్టారని విచారణలో బయటపడింది. దీంతో డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ రెడ్డప్ప తన సిబ్బందితో వెళ్లి నిందితులిద్దరినీ బుధవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు.

230 పోయి 19 పోస్టులు మిగిలాయి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పదోన్నతుల టీచర్లకు తీరని అన్యాయం చేశారంటూ టీచర్లు వాపోయారు. 117 జీఓ ఆధారంగా వచ్చిన 230 ఇంగ్లిష్ పదోన్నతుల పోస్టులు ఇప్పుడు కేవలం 19 మాత్రమే మిగులుగా చూపిస్తున్నారంటూ మండిపడ్డారు. బుధవారం స్థానిక శారదా నగరపాలక ఉన్నత పాఠశాలలో నిరసన తెలియజేశారు. విద్యాశాఖ అధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డీఈఓ చాంబరును ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే రెండేళ్లు సర్వీస్ కోల్పోయి నష్టపోయామని, 27 సంవత్సరాల సర్వీస్ కలిగి ఉండి ఒక్క ప్రమోషన్ కూడా లేకుండానే రిటైర్డ్ అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డీఓఈ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు జి.సూర్యుడు, రామాంజినేయులు, చంద్రశేఖర్, శ్రీనివాస నాయక్, జయరాం నాయక్, గోపాల్ రెడ్డి, శంకర మూర్తి, కేశవరెడ్డి, ఓబులేసు, లక్ష్మీనారాయణ, ధనలక్ష్మి, విజయ శ్రీ, నరసింహులు, ఓబిరెడ్డి, సూర్యనారాయణ, రసూల్ పాల్గొన్నారు. వీరికి వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఎస్.నాగిరెడ్డి, జి.శ్రీధర్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి రవీంద్రారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరమణ, రాష్ట్ర కౌన్సిలర్ గోపాల్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ మద్దతు తెలిపారు.

స్థానిక పాలనకు చిల్లు

గ్రామీణ, పట్టణ ప్రజలు స్థానికంగానే అన్ని రకాల ప్రభుత్వ సేవలనూ సచివాలయ వ్యవస్థ ద్వారా పొందడంతో జాతిపిత గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన ఈ వ్యవస్థ అన్ని వర్గాల ప్రజల ప్రశంసలు అందుకుంది. ఇంటి వద్దకే పింఛన్, రేషన్ సరుకులు, వైద్య సేవలు రావడం 'నభూతో.. నభవిష్యత్'గా నిలిచిపోయింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ క్రమక్రమంగా నిర్వీర్యమవుతోంది.

జిల్లాలో గ్రామ/ వార్డు సచివాలయాలు	544
రైతు భరోసా కేంద్రాలు	416
వలంటీర్లు	9,860
ఎండీయూ వాహనాలు	349
మహిళల సంఖ్య	13 లక్షలు పైగా
గ్యాస్ కనెక్షన్లు	8.3 లక్షలు
రేషన్ కార్డులు	5.66 లక్షలు
పింఛన్‌దారులు	2.60 లక్షలు

- సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం !
- వలంటీర్లు లేక వృద్ధుల అవస్థలు
- కాళ్లరిగేలా ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణ
- గత ప్రభుత్వంలో ఇంటి ముంగిటకే సేవలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నింటికీ ఇబ్బందులే





సాక్షి, పుట్టపర్తి: వ్యయప్రయాసలు తగ్గించి సత్వర సేవలు అందిస్తున్న సచివాలయ వ్యవస్థను కూటమి సర్కారు నిర్లక్ష్యం చేస్తోంది. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను తొలగించింది. రేషన్ సరుకులు అందజేసే ఎండీయూ వాహనాలను రద్దు చేసింది. ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంగళం పాడింది. దీంతో ప్రభుత్వ సేవల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సంక్షేమ పథకాలకు సమాధి..

వైఎస్సార్‌సీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలకు కూటమి సర్కారు సమాధి కట్టేసింది. ఏ ఒక్క పథకమూ ఇవ్వకుండా ప్రజలపై కక్ష కట్టినట్లు కనిపిస్తోంది. తాము అధికారంలోకి వస్తే 'సూపర్ సిక్స్' పేరుతో ఆరు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు ఏడాది అవుతున్నా ఏ పథకాన్ని కూడా ప్రజల్లోకి తీసుకెళ్లలేదు. 'తల్లికి వందనం' ఇవ్వలేదు. ఉచిత గ్యాస్ సిలిండర్ల విషయంలో చాలామందికి మొండిచెయ్యి చూపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదు. రైతుకు పెట్టుబడి సాయం ప్రస్తావనకే రాలేదు. ఇంటికో ఉద్యోగం పేరుతో నిరుద్యోగులను బురిడీ కొట్టించారు. బీసీ కులాలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని.. ఓట్లు పడ్డాక నిలువునా మోసం చేశారని చంద్రబాబు తీరుపై ప్రజలు మండి పడుతున్నారు.

హామీలు సరే.. అమలేదీ?



చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా హామీల అమలును విస్మరిస్తూనే ఉంటారు. నాడు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని ప్రకటించి.. అధికారంలోకి వచ్చాక చేతులెత్తేశారు. ఇప్పుడు కూడా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదు. ఇక ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి.. కొందరికే పరిమితం చేశారు. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.15వేలు ఇస్తామని చెప్పినా అతీగతీ లేదు. ఇంటివద్దకే రేషన్ పంపిణీ రద్దు చేసి మళ్లీ పడిగాపులు కాసే పరిస్థితి తెచ్చారు.

– కవిత, ప్రశాంతి గ్రామ్, పుట్టపర్తి

పోషణ భారమైంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పుణ్యమా అని వలంటీర్‌గా అవకాశమిచ్చారు. అర్హులైన వారందరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించాం. అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలు సంతృప్తి చెందే విధంగా విశిష్ట సేవలు అందించాం. మా సేవలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గుర్తించకుండా వలంటీర్ వ్యవస్థను రద్దు చేశారు. ఎన్నికల సమయంలో జీతం పెంచుతామని చెప్పి.. ఇప్పుడు ఉన్న ఉద్యోగాన్నే తీసేశారు. కుటుంబ పోషణ భారమైంది.

– హరీష్, వలంటీర్, చందకచెర్లు, మడకశిర మండలం

బాధ్యత కొరవడింది



సచివాలయాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ఇదే క్రమంలో ఎక్కువ శాతం మంది ఉద్యోగుల్లో బాధ్యత కొరవడింది. విధులకు ఎప్పుడు పడితే అప్పుడు వస్తున్నారు. ఏవైనా సమస్యలు తెలుపుదామంటే అధికారులు అందుబాటులో ఉండడం లేదు. చేసేదిలేక మండల కేంద్రానికి వెళ్లి అధికారులను సంప్రదించాల్సి వస్తోంది. గ్రామ సచివాలయాలను కూటమి ప్రభుత్వం గాడిన పెట్టి సేవలను పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది.

– దేవరాజు, ఎస్.ముద్దిరెడ్డిపల్లి, చిలమత్తూరు మండలం

మార్పుతోనే కుటుంబాలు బాగుపడతాయి



మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజశేఖర్

హిందూపురం: మార్పుతోనే కుటుంబాలు బాగుపడతాయని ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ సూచించారు. బుధవారం హిందూపురంలోని సబ్ జైలును ఆయన తనిఖీ చేశారు. వంటగది, శుద్ధ జలప్లాంట్, బ్యారక్‌లు, పరిసరాలు, నిత్యావసరాలు, ఫిర్యాదుల పెట్టె తదితరాలను పరిశీలించారు. ఖైదీల పట్ల తీసుకున్న జాగ్రత్తలను సబ్‌జైలు అధికారి హనుమప్పతో అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు రిమాండ్ ఖైదీలతో సమావేశమై మాట్లాడారు. ఏ తప్పు చేసి జైలుకు వచ్చారు, ఎప్పటి నుంచి జైలులో ఉంటున్నారు. కేసుల్లో వాదనలు వినిపించేందుకు న్యాయవాదులను ఏర్పాటు చేసుకున్నారా? లేదా? బెయిల్ మంజూరైనా జామీనుదారులు లేకపోవడం వల్ల ఎవరైనా ఇంకా జైలులోనే ఉంటున్నారా? అనే వివరాలను ఆరా తీశారు. అనంతరం ఖైదీలతో సమావేశమై మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పునకు జైలులో శిక్ష అనుభవిస్తున్నారని, తరచూ తప్పులు చేసి జైలుకు వెళుతుంటే కుటుంబ మర్యాదలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. చివరకు పిల్లలను కూడా సమాజంలో చిన్నచూపు చూస్తారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారు న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని స్థితిలో ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని పరిశీలించి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత ప్రశాంతయుత జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది జి.శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు జి.ఆర్.సిద్దు, పార్వతి, సంతోషికుమారి, ఈశ్వరప్ప, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే శారీరక, మానసిక ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న తదితరులు

పుట్టపర్తి టౌన్: యోగాతోనే శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని కలెక్టర్ చేతన్, ఎస్పీ పేర్కొన్నారు. బుధవారం ఉదయం పుట్టపర్తిలో విద్యాగిరి రోడ్డుపై పర్యాటక యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అన్ని శాఖల అధికారులు, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులతో పాటు పట్టణ ప్రజలు దాదాపు రెండు వేల మందితో కలిసి యోగాసనాలు వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహించాలని లక్ష్యం పెట్టుకొందని అందులో భాగంగా జిల్లాలో రెండు చోట్ల యోగాసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా సాధన చేస్తే వివిధ రకాల వృత్తులు, ఉద్యోగాలు వ్యాపారాల్లో మరింత నైపుణ్యత సాధిస్తారని తెలిపారు. చిన్న వయసు నుంచే యోగా చేస్తే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరిగి విద్యార్థులు చదువుల్లో బాగా రాణిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను జీవనశైలిలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం యోగా గురువును సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, క్రీడాభివృద్ధి అధికారి ఉదయభాస్కర్, డ్వామా పీడీ విజయానంద్, డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, బీసీ సంక్షేమశాఖ అధికారి నిర్మలాజ్యోతి, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ దరఖాస్తులు @ 9,783

- టీచర్ల బదిలీ ప్రక్రియ వేగవంతం
- హెచ్‌ఎంల వెబ్ ఆప్షన్లు పూర్తి, బదిలీల ఉత్తర్వుల విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల బదిలీ ప్రక్రియ వేగం పుంజుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హెచ్‌ఎంలు మొదలు అన్ని కేడర్ల టీచర్లు 14,784 మంది పని చేస్తున్నారు. వీరిలో 375 మంది హెచ్‌ఎంలు, 329 మంది పీఎస్‌హెచ్‌ఎంలు, 6,850 మంది స్కూల్ అసిస్టెంట్లు, 7,230 మంది ఎస్జీటీలు ఉన్నారు. 'టీచర్ల బదిలీ చట్టం-2025'లో భాగంగా అన్ని కేడర్ల టీచర్లు మొత్తం 9,783 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తప్పనిసరి బదిలీలు 6,060 మంది, రెక్వెస్ట్ బదిలీలకు 3,723 మంది దరఖాస్తు చేసుకున్నారు.

హెచ్‌ఎంలు 191 మంది దరఖాస్తు..

మొత్తం 191 మంది ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 28 మంది తప్పనిసరి బదిలీలు కాగా, 163 మంది రెక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే పీఎస్‌హెచ్‌ఎంలకు 208 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 33 మంది తప్పనిసరి బదిలీలు, 175 మంది రెక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. స్కూల్ అసిస్టెంట్లకు (లాంగ్వేజెస్) సంబంధించి 1,652 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 957 మంది తప్పనిసరి బదిలీలు, 695 మంది రెక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే స్కూల్ అసిస్టెంట్లు (నాన్ లాంగ్వేజెస్)కు సంబంధించి 2,935 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 1,879 మంది తప్పనిసరి, 1,056 మంది రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఎస్జీటీలకు సంబంధించి 4,642 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 3,088 మంది తప్పనిసరి, 1,554 మంది రెక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. పీఈటీలకు సంబంధించి 38 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 20 మంది తప్పనిసరి బదిలీలు, 18 మంది రెక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. లాంగ్వేజ్ పండిట్లకు సంబంధించి 117 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 55 మంది తప్పనిసరి బదిలీలు, 62 మంది రెక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.

ఖాళీల మొత్తం 7,912..

ఏడు రకాల ఖాళీలను మొత్తం 7,912 గుర్తించారు. వీటిలో హెచ్‌ఎం పోస్టులు 178, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 3,554, పీఎస్‌హెచ్‌ఎం 714, ఎస్జీటీ కేడర్‌లో 3,466 ఖాళీలున్నట్లు ఫైనల్ లెక్కలు తేల్చారు.

సబ్జెక్టుల వారీగా పరిశీలిస్తే...

ఎస్‌ఏ (తెలుగు) 286, ఉర్దూ 26, కన్నడ 02, సంస్కృతం 06, హిందీ 280, ఇంగ్లీష్ 604, గణితం 525, గణితం ఉర్దూ 24, గణితం కన్నడ 02, పీఎస్ తెలుగు 484, పీఎస్ ఉర్దూ 19, పీఎస్ కన్నడ 04, బీఎస్ తెలుగు 505, బీఎస్ ఉర్దూ 20, బీఎస్ కన్నడ 05, సోషల్ తెలుగు 394, సోషల్ ఉర్దూ 17, సోషల్ కన్నడ 02, ఎస్‌ఏ పీడీ 318, ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ 31 ఖాళీలున్నాయి. అలాగే పీఎస్‌హెచ్‌ఎం/ఎస్‌ఏ (తెలుగు) 692, పీఎస్‌హెచ్‌ఎం/ఎస్‌ఏ (ఉర్దూ) 19, పీఎస్‌హెచ్‌ఎం/ఎస్‌ఏ (కన్నడ) 03 పోస్టులు, ఎస్జీటీ తెలుగు 3,331, ఎస్జీటీ ఉర్దూ 116, ఎస్జీటీ కన్నడ 19 ఖాళీలున్నాయి.

హెచ్‌ఎం వెబ్‌ఆప్షన్లు పూర్తి.. ఉత్తర్వులు సిద్ధం

హెచ్‌ఎం దరఖాస్తుల వెరిఫికేషన్లు పూర్తయి వెబ్ ఆప్షన్లు బుధవారం నాటికి పూర్తయ్యాయి. అర్ధ రాత్రి తర్వాత బదిలీ ఉత్తర్వులు జనరేట్ అవుతాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. అలాగే స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి తాత్కాలిక సీనియార్టీ జాబితా విడుదలయింది. దీనిపై గురువారం అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అలాగే ఎస్జీటీలకు సంబంధించి దరఖాస్తుల ఆన్‌లైన్ పరిశీలన ప్రక్రియ పూర్తయింది.

ఖరీఫ్ పెట్టుబడికి పాట్లు

- అమలుకు నోచుకోని అన్నదాత సుఖీభవ
- గత ప్రభుత్వంలో ఠంచన్‌గా పెట్టుబడి సాయం
- నేడు పంటలు పెట్టేందుకు డబ్బు లేక రైతుల అగచాట్లు



ముందస్తు వర్షాలకు ట్రాక్టర్‌తో దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతు

వైఎస్ జగన్ హయాంలో జిల్లాలో రైతు భరోసా లబ్ధి వివరాలు		
సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	2,56,170	345.83
2020-21	2,78,337	375.75
2021-22	2,70,443	359.80
2022-23	2,68,947	364.24
2023-24	2,79,556	321.47

జిల్లాలో ఖరీఫ్-2025 పంటల సాగు అంచనా..	
మొత్తం సాగు అంచనా:	2,69,152 హెక్టార్లు
వేరుశనగ:	1,51,824 హెక్టార్లు
కంది:	28,925 హెక్టార్లు
మొక్కజొన్న:	17,949 హెక్టార్లు

మడకశిర: జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పదునైన వర్షం పడుతుండడంతో ఖరీఫ్ - 2025 సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతుభరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం రూ.13,500 ఠంచన్‌గా అందడంతో సకాలంలో పంటలు సాగు చేసుకునేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తామన్న ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి సాయంపై ఇంతవరకూ స్పష్టత లేదు. దీంతో రైతులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా పంటలు పెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో అన్ని రకాల పంటలు 2,69,152 హెక్టార్ల విస్తీర్ణంలో సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

ఆర్థిక ఇబ్బందులతో సతమతం..

ఖరీఫ్‌లో వ్యవసాయం చేయడానికి రైతులకు పెట్టుబడి చాలా ముఖ్యం. ప్రధానంగా భూములను దుక్కి దున్నుకోవడం నుంచి విత్తు వరకు ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ముఖ్యంగా వేరుశనగ సాగు చేసే భూములను దుక్కి చేసుకోవడానికి ట్రాక్టర్‌కు గంటకు అద్దె రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. విత్తనాలు, క్రిమి సంహారక మందుల కొనుగోలుకు కూడా డబ్బు అవసరం. కూలీల ఖర్చులు రూ.వేలల్లోనే ఉంటాయి. ఎకరా విస్తీర్ణంలో వేరుశనగ పంట సాగు చేయడానికి రైతులకు రూ.25 వేల వరకు పెట్టుబడి అవసరమవుతుంది. ఇలాంటి పరిస్థితిలో కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకుండా కాలయాపన చేస్తుండడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

సంక్షోభంలో వ్యవసాయం



రైతులను ఆదుకోవడంలో కూటమి సర్కారు పూర్తిగా విఫలమైంది. ఇంత వరకు పెట్టుబడి సాయం అందించలేదు. విత్తనాలను పంపిణీ చేయలేదు. ప్రజా ప్రతినిధులు రైతుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదు. వ్యవసాయ రంగాన్ని, రైతులను సంక్షోభంలోకి నెట్టిన ఘనత ఈప్రభుత్వాదే.

– ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

విత్తనం కోసం ఎదురుచూపు



సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల కోసం ఎదురు చూస్తున్నాం. అయితే ప్రభుత్వం విత్తన పంపిణీకి చర్యలు తీసుకోలేదు. విత్తనం సకాలంలో అందుతుందో లేదోనన్న ఆందోళనలో ఉన్నాం. ప్రభుత్వం సకాలంలో విత్తనం అందించకపోతే రైతుల నుంచి వ్యతిరేకత తప్పదు.

– శ్రీనివాస్, రైతు, హెచ్‌టీహళ్లి, రొళ్ల మండలం

సాగుకు సాయమందించండి



విత్తుకు సమయం దగ్గర పడుతోంది. వర్షాలు కూడా అనుకూలంగా పడుతున్నాయి. పెట్టుబడి సాయంతో పాటు సబ్సిడీ విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలి.

– నాగరాజు, రైతు, గుడ్డదహళ్లి, గుడిబండ మండలం

క్లుప్తంగా

ప్రమాదంలో వ్యక్తి మృతి


నరసింహులు (ఫైల్)

కొత్తచెరువు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ రైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... కొత్తచెరువు మండలం లోచర్ల గ్రామానికి చెందిన నరసింహులు (62)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవారు. వ్యక్తిగత పనిపై మంగళవారం కొత్తచెరువుకు వెళ్లిన ఆయన సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలో వాహనం అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వారు గుర్తించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడు నరసింహులు గతంలో లోచర్ల సాగునీటి సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు


మహేష్ (ఫైల్)

బెళుగుప్ప: మండల పరిధిలోని శీర్పి గ్రామానికి చెందిన తన భర్త మంగలి మహేష్ ఈనెల 20 నుంచి కనిపించడం లేదని భార్య రూప బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. క్రాప్‌లోన్ రెన్యూవల్ కోసం కళ్యాణదుర్గం వెళ్లిన మహేష్.. తిరిగి ఇంటికి రాలేదు. చుట్టు ప్రక్కల గ్రామాలు, బంధువులను విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. భార్య రూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ బాల నరసింహులు కేసు నమోదు చేశారు.

జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు



అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాలలోని ఆరు విభాగాలకు ఎన్‌బీఏ (నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు దక్కింది. సివిల్, కెమికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్సెస్ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించింది. అక్రిడిటేషన్ రావడానికి తోడ్పాటు అందించిన విభాగాధిపతులు, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బందికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి అభినందనలు తెలిపారు. ఎన్‌బీఏ గుర్తింపు గల కళాశాల జారీ చేసే సర్టిఫికెట్‌కు విలువ అధికంగా ఉంటుంది. నాణ్యతా ప్రమాణాలకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్ నిదర్శనంగా నిలుస్తుంది.

ఈ పనులకు మోక్షమెన్నడో!


మరమ్మతు పనులు నిలిచి పోవడంతో కిందకు దిగని పేరూరు డ్యాం గేట్లు


మరమ్మతుల కోసమని ఉన్న నీటిని దిగువకు వదిలేయడంతో ఖాళీ అయిన డ్యాం


మరమ్మతుల కోసమని గేట్ చైన్‌ను తొలగించిన దృశ్యం

రామగిరి: దశాబ్దాలుగా నీటిబొట్టులేక బోసిపోయిన పేరూరు డ్యాం (అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్).. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తి జలకళను సంతరించుకుంది. ఐదేళ్ల పాటు ఆయకట్టు మురిసిపోయింది. చుట్టుపక్కల భూగర్భ జలాలు వృద్ధి చెందడంతో వ్యవసాయ బోరు బావుల కింద వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పేరూరు డ్యాం పరిస్థితి క్షీణిస్తూ వచ్చింది. నీటి కేటాయింపులు లేక డ్యాం బోసిపోతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డ్యామ్ గేట్ల మరమ్మతులకు రూ.1.21 కోట్లను మంజూరు చేసిన కూటమి సర్కార్... పనులు పూర్తి చేయించడంలో అంతులేని ఉదాసీనత కనబరుస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 17న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేరూరు డ్యాంను సందర్శించి గేట్ల మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నాలుగు నెలలు గడిచినా పనుల్లో ఏ మాత్రమూ ప్రగతి లేదు. వేసవి ముగిసింది. వర్షాలు మొదలయ్యాయి. భారీ వర్షాలు కురిస్తే పేరూరు డ్యాం పూర్తిగా నిండే అవకాశముంది. ఇలాంటి తరుణంలో డ్యామ్‌కు గేట్లు లేకపోవడంతో ఆ నీరంతా వృథా అవుతుందని అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

పారిశ్రామిక వాడలో విద్యుత్ సమస్య

- ప్రతి ఐదు నిమిషాలకోసారి విద్యుత్ సరఫరాలో అంతరాయం
- రోజూ రూ.వేలలో నష్టపోతున్నామంటున్న పరిశ్రమల నిర్వాహకులు


విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నీటి ప్యాకెట్ల ఉత్పత్తిని ఆపేసి ఎదురు చూస్తున్న కార్మికులు

కదిరి అర్బన్: అధికారంలోకి వస్తే పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టిస్తామన్న కూటమి పెద్దలు.. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే ప్రగతి మాటను పక్కనపెట్టి ఉన్న పరిశ్రమలూ మూత పడేందుకు కారణమవుతోంది. ఇందుకు కదిరిలోని పారిశ్రామిక వాడనే నిదర్శనం. కుమ్మరవాండ్లపల్లిలో ఉన్న పారిశ్రామిక వాడలో గతంలో ఎన్నడూ లేనంతగా ఇటీవల విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటోంది. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు ఆ దిశగా కన్నెత్తి కూడా చూడడంలేదు. దీంతో ఉన్న పరిశ్రమలు కాస్త మూతేసుకోవాల్సి వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు.

రోజూ 15 సార్లు అంతరాయం..

కదిరి పట్టణానికి ఆనుకుని ఉన్న కుమ్మరవాండ్లపల్లిలో 50 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ రకాల 25 పరిశ్రమలను ఔత్సాహికులు ఏర్పాటు చేశారు. కవర్ల తయారీ, వేరుశనగ ప్రాసెసింగ్, బీరువాల తయారీ, సోఫాలు.. కుర్చీల తయారీ, బిందెల తయారీ, పట్టు పరిశ్రమ, ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు తదితర పరిశ్రమల్లో ప్రత్యక్షంగా పరోక్షంగా 2 వేలకు పైగా కార్మికులు ఉపాధి పొందుతున్నారు. దాదాపు నెల రోజులుగా విద్యుత్ సరఫరాలో తీరని అంతరాయంతో పరిశ్రమల నిర్వహణ భారమవుతోందని యజమానులు వాపోతున్నారు. రోజులో 15 సార్లు కరెంటు వచ్చి పోతోందని పేర్కొంటున్నారు. ఒక్కోసారి 5 నుంచి 10 నిమిషాల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటోందని, దీంతో యంత్రాలను ఆపడం ద్వారా ఉత్పత్తి గణనీయంగా తగ్గి నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకుని వచ్చిన తర్వాత యంత్రాలను ఆన్ చేయబోతుండగా వెంటనే సరఫరా నిలిచిపోతుంటుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యంత్రాలు మరమ్మతుకు లోనై ఆర్థిక భారం మరింత పెరిగి పోతోందని పారిశ్రామిక వేత్తలు వాపోతున్నారు. ప్రతి నెలా రూ.లక్షల్లో బిల్లులు చెల్లిస్తున్నా.. నాణ్యమైన విద్యుత్‌ను ప్రభుత్వం అందించలేకపోతోందని ఆరోపిస్తున్నారు.

రోజూ రూ. 2 వేలు నష్టం



నేను నిర్వహిస్తున్న వాటర్ ప్యాకెట్ తయారీ పరిశ్రమలో 50 మంది కార్మికులు పనిచేస్తున్నారు. రోజూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా రూ.2 వేలకు పైగా నష్టం వస్తోంది. సమస్య పరిష్కారానికి విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా పనిలోకి వచ్చే కార్మికుల సంఖ్యను తగ్గించుకోవాల్సి వస్తోంది. ఇది పరోక్షంగా కార్మిక కుటుంబాల జీవనంపై ప్రభావం చూపుతోంది.

– నాగార్జునరెడ్డి, నీటి కవర్ల తయారీ కంపెనీ యజమాని

ఫీడర్ మార్పు చేయాలి

కదిరి, తలుపుల మండలం రెండూ నేనే చూసుకోవాల్సి వస్తోంది. దీంతో పని భారం పెరిగి సకాలంలో సమస్యలు పరిష్కారం కాలేకపోతున్నాయి. కుమ్మరవాండ్లపల్లిలో విద్యుత్ ఫీడర్ బైఫర్‌గేషన్ చేయాల్సి ఉంది. 1వ తేదీలోపు చేస్తాం. ఫీడర్ సమస్య తీరితే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదు. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తాం.

– గౌరిశంకర్, విద్యుత్ శాఖ ఏఈ

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. కడుపు నొప్పి తాళలేక ఒకరు.. కుటుంబ కలహాల నేపథ్యంలో వలస కార్మికుడితో పాటు మరో రైతు ఆత్మహత్య చేసుకున్నారు.


సుధాకర్ (ఫైల్)

- **నల్లచెరువు:** స్థానిక వీవర్స్ కాలనీకి చెందిన సుధాకర్(45) ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని దిగువపల్లికి చెందిన సుధాకర్ తన భార్య అనితతో కలసి వీవర్స్ కాలనీలో ఆరేళ్లుగా నివాసముంటున్నాడు. వృత్తిరీత్యా హిందూపురం ఆర్టీసీ డిపోలో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రెండు నెలలుగా కడుపు, వెన్ను నొప్పి కారణంగా మెడికల్ లీవ్ కింద ఇంటి పట్టునే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల ఇద్దరు కుమార్తెలతో కలసి భార్య అనిత తన పుట్టింటికి వెళ్లింది. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుధాకర్ పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మక్బూల్ బాషా తెలిపారు.
- **ధర్మవరం రూరల్:** మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన రైతు జ్వాల లక్ష్మీరెడ్డి(60) ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. దీంతో బంధువుల ఇళ్లలో కుటుంబసభ్యులు ఆరా తీశారు. పొలం వద్దకెళ్లి పరిశీలించారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం తన పొలానికి సమీపంలో ఉన్న వంకలో కంప చెట్టుకు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న లక్ష్మీరెడ్డిని గొర్రెల కాపరులు గుర్తించారు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని ఉరికి వేలాడుతున్న లక్ష్మీరెడ్డి మృతదేహాన్ని గమనించి బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ధర్మవరం రూరల్ పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, లక్ష్మీరెడ్డి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సిఉంది.
- ధర్మవరం మండలం వెంకట తిమ్మాపురం గ్రామ పొలాల్లో బుధవారం మహారాష్ట్రకు చెందిన గణపత్ భానుదాస్ (41) ఆత్మహత్య చేసుకున్నాడు. మహారాష్ట్రలోని సుధాఘడ్ రాణిఘర్‌కు చెందిన భానుదాస్.. భార్యతో కలిసి వలస వచ్చి వెంకటతిమ్మాపురంలో స్థిరపడ్డాడు. కట్టెలు కాల్చి బొగ్గుల వ్యాపారం చేస్తుండేవారు. రెండు రోజుల క్రితం దంపతుల మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో భార్య అలిగి మహారాష్ట్రకు వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన భానుదాస్ బుధవారం తాను నివాసముంటున్న గుడిసెలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నగరంలో కలకలం రేపిన ముగ్గురు చిన్నారుల అదృశ్యం

- డోన్‌లో ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు
- తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగింత

అనంతపురం: జిల్లా కేంద్రంలో ముగ్గురు చిన్నారుల అదృశ్యం కలకలం రేపింది. ఒకే ఇంట్లో ఇద్దరు, పొరుగింటి చిన్నారి ఒకరు మొత్తం ముగ్గురు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు కంగారు పడ్డారు. వివరాలు.. అనంతపురంలోని రామచంద్ర నగర్‌లో నివాసముంటున్న వ్యక్తి పల్లెల్లో తిరుగుతూ వన్ గ్రామ్, రోల్డ్‌గోల్డ్ నగల విక్రయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని భార్య స్థానిక షిర్డీనగర్‌లో ప్లాస్టిక్ ఫ్లవర్ షాపు ఏర్పాటు చేసుకుని కుటుంబానికి చేదోడుగా నిలిచింది. వీరికి 12 ఏళ్ల వయసున్న కుమార్తె, 8 ఏళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. వేసవి సెలవులు కావడంతో ఇంటి పట్టునే పిల్లలు ఉంటూ ఆడుకునేవారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 6 గంటలకు తండ్రి వ్యాపారం నిమిత్తం పల్లెలకు వెళ్లిపోయాడు. ఉదయం 8:15 గంటలకు తల్లి కూడా దుకాణానికి వెళ్లిపోయింది. ఉదయం 9:30 గంటలకు తండ్రి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే పిల్లలిద్దరూ కనిపించకపోవడంతో చుట్టుపక్కల ఆరా తీశాడు. వారితో పాటు ఆడుకుంటున్న పక్కింట్లో నివాముంటున్న వారి 8 ఏళ్ల వయసున్న కుమార్తె కూడా కనిపించకపోవడంతో ఇరు కుటుంబాల్లోనూ ఆందోళన వ్యక్తమైంది. చుట్టుపక్కల కాలనీలు గాలించారు. బస్టాండు, రైల్వేస్టేషన్లు జల్లెడ పట్టారు. స్నేహితులు... బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డోన్‌లో ఆచూకీ..

చిన్నారుల అదృశ్యమైన అంశాన్ని సీఐ కె.శాంతిలాల్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు వేగవంతం చేశారు. చిన్నారుల స్నేహితులను ఆరా తీశారు. తమ సొంతూరు డోన్‌కు వెళుతున్నట్లుగా అక్క, తమ్ముడు తెలిపారని స్నేహితులు వివరించడంతో రామచంద్ర నగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రతి సీసీ కెమెరా పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కతమ్ముడితో పాటు పక్కింటికి చెందిన అమ్మాయి కూడా పుటేజీల్లో కనిపించడంతో తల్లిదండ్రులతో పాటు పోలీసులూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం రామచంద్రనగర్ నుంచి చంద్ర ఆస్పత్రి సర్కిల్ మీదుగా గుత్తి రోడ్డుకు చేరుకున్న చిన్నారులు అక్కడ బస్సు ఎక్కినట్లుగా గుర్తించి, వెంటనే కర్నూలు జిల్లా పోలీసులను అప్రమత్తం చేయడంతో డోన్ బస్టాండులో బస్సు దిగగానే చిన్నారులను అక్కడి పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం వారిని సురక్షితంగా అనంతపురానికి తీసుకొచ్చి సీఐ శాంతిలాల్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

నీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పుట్టపర్తిటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. స్థానిక పంప్ హౌస్ వద్ద బుధవారం కార్మికుల సమావేశం జరిగింది. తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలపై కార్మికులు చర్చించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ క్రాంతికుమార్‌ను కలసి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ... శ్రీసత్యసాయి నీటి సరఫరా విభాగానికి సంబంధించి రూ.8 కోట్ల బకాయిలను మున్సిపాలిటీ చెల్లించాల్సి ఉందన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో నీటి సరఫరాను నిలిపి వేశారన్నారు. ఫలితంగా పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తిందని వివరించారు. అలాగే వెంగలమ్మ చెరువు పంప్ హౌస్ నుంచి 35 ఏళ్లుగా నీటి సరఫరా ఆగిపోయిందన్నారు. దీంతో కార్మికులకు చెల్లించాల్సిన నాలుగు నెలల వేతనాలు బకాయి పడ్డాయన్నారు.10నెలల పీఎఫ్ చెల్లించనందున కార్మికులు ఇబ్బందులు పడ్డారన్నారు. మున్సిపాలిటీ బకాయిలు చెల్లించక పోవడం వల్లనే సమస్య ఉత్పన్నమైందన్నారు. తక్షణమే బకాయిలు చెల్లించి, కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి నీటి సరఫరా కార్మిక సంఘం అధ్యక్షుడు నరేష్, నాయకులు మధునూదన్, బాలు, శివప్రసాద్, లక్ష్మీనారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డులో ఆరుగురు బదిలీ

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆరుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఇక్కడ సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న ముగ్గురిలో కేశవ్‌కుమార్ కళ్యాణదుర్గం మార్కెట్ కమిటీకి, నాగేంద్ర కదిరికి, కృపావతి శింగనమల కమిటీకి బదిలీపై వెళుతున్నారు. అలాగే యూడీసీ తిరుపాలు హిందూపురానికి, ఎల్‌డీసీ మల్లిక ధర్మవరం కమిటీకి, క్లర్క్ శైలజాకుమారి హిందూపురం మార్కెట్ కమిటీకి బదిలీ అయినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. వారి స్థానాల్లో మిగతా మార్కెట్ కమిటీల నుంచి ఆరుగురు బదిలీపై ఇక్కడికి వస్తున్నారు.

గూగూడులో జస్టిస్ నారాయణ నాయక్


కుళ్లాయి స్వామిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు జడ్జి నారాయణ నాయక్

నార్పల: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయి స్వామి, ఆంజనేయ స్వాములను బుధవారం తెలంగాణ హైకోర్టు జడ్జి నారాయణ నాయక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్జి ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

మహిళపై కుటుంబసభ్యుల దాడి

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌కు చెందిన బాలన్న భార్య గాలి మేరీపై ఆమె పెద్ద కుమారుడు జ్యాకిమ్, కోడలు లత దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపిన మేరకు... బాలన్న, గాలి మేరీ దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. తల్లిదండ్రులు చిన్మయనగర్‌లో నివాసం ఉంటుండగా, పెద్ద కుమారుడు జ్యాకిమ్, అతని భార్య లత ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్నారు. అమ్మకు చెందిన ఆస్తి విషయంలో ఈ నెల 26న తల్లితో జ్యాకిమ్ గొడవపడ్డాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో జ్యాకిమ్, లత చేతికి అందుబాటులో ఉన్న రీపర్ తీసుకుని మేరీపై దాడి చేశారు. తలకు తీవ్ర గాయమై 18 కుట్లు పడ్డాయి. ఘటన జరిగిన రోజు తలకు తగిలిన గాయం వల్ల ఏమీ జరిగిందో ఆమె పోలీసులకు చెప్పలేకపోయింది. బుధవారం ఆరోగ్యం కుదుటపడడంతో జరిగిన ఘటన వివరిస్తూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

భక్తులను రంజింపజేసిన సాయి కథ




'సాయి కథ' సాంస్కృతిక ప్రదర్శనలోని ఘట్టాలు

ప్రశాంతి నిలయం: బాబా జీవిత చరిత్రను తెలుపుతూ ప్రదర్శించిన 'సాయి కథ' సాంస్కృతిక కార్యక్రమం భక్తులను రంజింపజేసింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఈరోడ్, సేలం జిల్లా సత్యసాయి భక్తులు బుధవారం సాయికుల్వంత్ సభా మందిరంలో మహాసమాధి చెంత సంగీత కచేరీ నిర్వహించారు. చక్కటి భక్తిగీతాలతో సాగిన కచేరీ పరవశింపజేసింది. సత్యసాయి అవతారవర వైభవాన్ని వివరిస్తూ చక్కటి నృత్య ప్రదర్శనతో సాగిన 'సాయి కథ' సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది.


సంగీత కచేరీ నిర్వహిస్తున్న సత్యసాయి భక్తులు